క్లుప్తంగా

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు : మను బోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపం లో ఉన్న విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి వి విధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచా మృతాలతో రుద్రాభి షేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. డాక్టర్ భాస్కర్, ఆడిపూడి రామిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా మోహన్‌రావు



నియామక పత్రాన్ని అందుకుంటున్న మోహన్‌రావు

వెంకటాచలం : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటాచలం మండలం ఎగువమిట్ట పంచాయతీ కార్యదర్శి తుమ్మతాటి మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా, ఎగువమిట్ట పంచాయతీ కార్యదర్శి తుమ్మతాటి మోహన్‌రావును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రత్నం చేతుల మీదుగా అందుకున్నారు. ఈ మేరకు మోహన్‌రావును పలువురు శాలువా, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఘనంగా భాషా వార్షికోత్సవాలు



ముత్తుకూరు : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో భాషా వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపల్ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రిభాషా సూత్రంలో మాతృభాష గొప్పదన్నారు. విద్యార్థులు భాషపై పట్టు సాధించాలని, ప్రపంచంలో ఎక్కడైనా పర్యటించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ఆంగ్ల, తెలుగు భాష పాటలకు నృత్యాలు చేసి అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, పద్మావతి

వెంకటాచలం: పేదల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని ఏడీపీఎస్ అధ్యక్షుడు రామచంద్రరావు కొనియాడారు. కొప్పోలు వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతుల దాతృత్వంతో మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మంగళంపాడులో ఆదివారం రాత్రి బాబాసాహెబ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ యువత అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొప్పోలు యశ్వంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకులను ఆదుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నాను. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నారు. దీనివల్ల సరైన ఆదాయం ఉండడం లేదు. ప్రభుత్వం మాలాంటి వారిని ఆదుకోవాలి.

– ఉయ్యూరు జ్యోతి, కోవూరు

చాలా మంది తినడం లేదు



కోవూరు జేబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 754 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 494 మంది మాత్రమే పాఠశాలకు వస్తుండగా 344 మంది మాత్రమే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. చాలా మంది తినడం లేదు. బడికి వచ్చిన అందరికీ చిక్కీలు, కోడిగుడ్లు అందిస్తున్నాం.

– శ్రీహరి, హెచ్‌ఎం, కోవూరు పాఠశాల

మరుగుదొడ్లు నిర్మించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులతో పాటు మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా తాగునీటి సమస్యల చాలా పాఠశాలల్లో ఉంది. పిల్లలు ఆడుకోవడానికి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలి.

– ఏళ్ల కోటేశ్వరరావు, కోవూరు

పేదల చదువుకు తూట్లు

విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో విద్యాకానుక అందలేదు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడడంతో చాలా చోట్ల విద్యార్థులు ఇంటి వద్ద నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న వేళల్లో భోజనం చేసేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాఠశాల వరండాల్లో, చెట్ల కింద తింటున్నారు. అంతే కాకుండా చాలా పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఇలా రెండు నెలల్లో పేదల చదువుకు తూట్లు పొడుస్తూ చంద్రన్న పాలన సాగిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల విద్యను బలోపేతం చేసే దిశగా పాలన సాగించాలని పలువురు హితవు పలుకుతున్నారు.



పొదలకూరులో చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

- చెట్ల కిందే మధ్యాహ్న భోజనం
- పూర్తిస్థాయిలో అందని పుస్తకాలు
- ప్రధాన సబ్జెక్టులకు టీచర్ల కొరత
- కొన్ని పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు
- ఫలితంగా గణనీయంగా తగ్గిన విద్యార్థులు

పొదలకూరు : నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో పోల్చుకుంటే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. చాలా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో విద్యాకానుక కిట్లను అందజేయలేదు. మధ్యాహ్న భోజన పథకం జగనన్న గోరుముద్ద పేరును కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరును మార్చారు. అయితే గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారమే భోజనాన్ని అందిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయిన తర్వాత కొద్దిరోజులు విద్యార్థులకు చిక్కీలు అందజేయలేదు. తర్వాత జులై 15 నుంచి చిక్కీలను కూడా అందజేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలైన పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, తోటపల్లిగూడూరులలో 869 మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇందులో చాలామందికి ఇప్పటి వరకు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి అందలేదు. చాలా పాఠశాలల్లో డైనింగ్ హాల్స్ లేకపోవడం వల్ల విద్యార్థులు చెట్ల కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. వంట గదులు లేని పాఠశాలల్లో చెట్ల కింద తాత్కాలికంగా రేకులను ఏర్పాటు చేసుకుని వంట వండుతున్నారు. అయితే చెట్ల కింద వంట చేయడం, పిల్లలు భోజనం తినడం వల్ల పురుగులు, ఇతర కీటకాలు అన్నంలో పడే అవకాశం ఉందంటున్నారు. పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 700 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ తాగునీటి సమస్య ఉంది. ఆర్వో ప్లాంట్ ఆగిపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. తోటపల్లిగూడూరు మండలంలో 8 మంది, పొదలకూరు మండలంలో ఇద్దరు, ముత్తుకూరు మండలంలో 4, మనుబోలు మండలంలో 10 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. వీరిలో సబ్జెక్టు టీచర్లు ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది.

సర్వేపల్లి నియోజకవర్గంలో..	
2023-24 విద్యా సంవత్సరంలో..	25,599 మంది
2024-25 విద్యాసంవత్సరంలో..	24,730 మంది
తగ్గిన విద్యార్థుల సంఖ్య	869 మంది
ఉపాధ్యాయుల కొరత	24 మంది

పాఠశాలలు అస్తవ్యస్తం



ప్రభుత్వ పాఠశాల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి నాలుగు మాసాలుగా జీతాలు చెల్లించడం లేదు. తల్లికి వందనం ఎప్పుడు అమలవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

– తైదుపాటి వనజ, ఈపూరు, ముత్తుకూరు మండలం

ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. తాగునీటి కొరత ఉన్న పాఠశాలల్లో వెంటనే అధికారులు నీటి సౌకర్యం కల్పిస్తే మంచిది. గత ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి.

– కేతు రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, దుగ్గుంట, పొదలకూరు మండలం

సౌకర్యాలు కల్పించాలి



కోవూరు జేబీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపి వేయడం సరికాదు. అలాగే పాఠశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్లను భర్తీ చేయాలి. విద్యార్థులకు సరైన సమయంలో విద్యాకానుకలు అందించాలి.

– శ్రీకాంత్, విద్యార్థి తండ్రి

మౌలిక వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు తరగతి గదులు లేవు. దీనివల్ల విద్యార్థులు ఆరుబయట విద్యను అభ్యసించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– జొన్నవాడ శ్రావణ్‌కుమార్, స్టూడెంట్ లీడర్, పడుగుపాడు



కోవూరు శాంతినగర్ పాఠశాలలో సింగిల్ టీచర్ బోధన



పొదలకూరులో చెట్ల కింద తాత్కాలింగా నిర్మించిన వంటశాల



కోవూరు జేబీఆర్ పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

ఖాళీలను భర్తీ చేయాలి



పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కూటమి ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాలో జమ చేయాలి.

–ఎం.విజయ, కేఆర్‌పురం, మనుబోలు

స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ కోరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ ఆవశ్యకతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో చదువు మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశమన్నారు. 15 ఏళ్ల వయస్సు దాటిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చదవడం, రాయడం వచ్చిన వారు ఎలాంటి విద్యార్హత లేకుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) వారు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో చేరిన వారికి ప్రత్యేకంగా తరగతులు కూడా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు, వెలుగు ఏపీఎం ఎస్.రుక్మిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, సీఆర్‌ఎంటీలు జె.పెంచలరావు, ఎం.దయాకర్, పులి రమేష్, సీహెచ్ శ్రీహరిబాబు, తోట వెంకట సురేష్, గూడూరు విజయమ్మ, మస్తాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు

వెంకటాచలం : శ్రీకాకుళంలో ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని గొలగమూడిలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికై నట్లు హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరి దేవి, పీడీ షేక్.షబిక సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థినులు టి.నాగలక్ష్మి వరప్రసన్న, ఆర్.శ్రీలత జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు.



నాగలక్ష్మి వరప్రసన్న



ఆర్.శ్రీలత

తల్లిపాలు బిడ్డకు అమృతం



తోటపల్లిగూడూరు : తోటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ-2

మనుబోలు : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ రమణమ్మ అన్నారు. మనుబోలు అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం ఆరు నెలల పాటైనా బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ శ్రీరమ్య, అంగన్‌వాడీలు విజయమ్మ, సుగుణమ్మ, సుజన పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్టం

పొదలకూరు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేష్టమని మహ్మదాపురం సెక్టార్ ఐసీటీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని మహ్మదాపురం అంగన్‌వాడీ(మెయిన్) కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలకు తల్లిపాలు పట్టిస్తే జబ్బులు రావన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పెంచలమ్మ, ఆశావర్కర్ సుజాత, టీచర్లు వి.రాజేశ్వరీ, భారతి, ప్రమీలా పాల్గొన్నారు.

- పట్టణంలోని శ్రామికనగర్‌లో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డలకు తల్లిపాలనే పట్టిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, ప్రవీణకుమారి, స్వాతి, ఏఎన్‌ఎం అరుణ, ఆశావర్కర్లు రమణమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఏడో వార్డు ఖాజానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం అందించామని తెలిపారు. గర్భిణులకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. తల్లి కాబోయే ప్రతి మహిళ బిడ్డకు పాలు ఇవ్వడంపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఏవైనా సందేహాలు ఉంటే వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, ఆశా కార్యకర్తలను అడిగి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి

తోటపల్లిగూడూరు : పుట్టిన బిడ్డకు గంటల వ్యవధిలోనే తల్లి ముర్రుపాలను పట్టించాలని ఎంఈఓ–2 జయరామనాయుడు సూచించారు. మండలంలోని తోటపల్లి పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు ఔషధం లాంటిదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణప్రియ, విమల, సుభాషిణి, భాగ్యలక్ష్మి, పోలమ్మ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న రమణమ్మ



పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



పొదలకూరు తహసీల్దార్

పొదలకూరు : మండల తహసీల్దార్‌గా ఎం.సారంగపాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వాకాడు ఎంఎల్‌ఎస్ పాయింట్ డీటీగా పనిచేస్తూ అడ్‌హక్ తహసీల్దార్‌గా పొదలకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వెంకటాచలం తహసీల్దార్‌గా శ్రీనివాసులు

వెంకటాచలం : వెంకటాచలం తహసీల్దార్‌గా ఎన్.శ్రీనివాసులు సోమవారం మండల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మనుబోలు తహసీల్దార్‌గా సుబ్బయ్య

మనుబోలు : మనుబోలు మండల తహసీల్దార్‌గా సీహెచ్ సుబ్బయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కోవూరు, ఇందుకూరుపేట మండలాల తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా బాపట్లకు వెళ్లి ఇటీవలే సొంత జిల్లా వచ్చారు. పలువురు అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీటీ శివప్రసాద్, ఆర్‌ఐ సుధీర్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి

ఇందుకూరుపేట తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్

ఇందుకూరుపేట : మండల నూతన తహసీల్దార్‌గా టీవీఎం కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.



కొడవలూరు: బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ స్ఫూర్తి

కొడవలూరు తహసీల్దార్‌గా స్ఫూర్తి

కొడవలూరు : మండల తహసీల్దార్‌గా కె.స్ఫూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కలెక్టరేట్‌లో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్ఫూర్తిని డీటీ శైలజాకుమారి, ఆర్‌ఐ సునీల్‌కుమార్, వీఆర్వోలు జి.రఘురామయ్య, ఏడుకొండలు, వినయ్, జి.శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

టీపీగూడూరు తహసీల్దార్‌గా పద్మజ

తోటపల్లిగూడూరు : మండల నూతన తహసీల్దార్‌గా పద్మజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కోవూరు తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మాధవిరెడ్డి నెల్లూరు సీసీఎల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా డీటీ శివయ్య, మండల వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.



మనుబోలు తహసీల్దార్ సుబ్బయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు



వెంకటాచలం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎన్.శ్రీనివాసులు



తహసీల్దార్ పద్మజకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

విరాళాల సేకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం మండలంలోని సీపీఎం నాయకులు సోమవారం విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని జిల్లా కమిటీ ద్వార బాధితులకు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, షేక్ జానీబాషా, మునీర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూ దోపిడీపై విచారణ చేపట్టండి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు : మండల పరిధిలోని చెరుకుమూడి రెవెన్యూ పరిధి హైవే పక్కన అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై కలెక్టర్ విచారణ చేపట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని కొమ్మలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో వివాదాస్పద భూములను ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమ్మలపూడిలో 20 ఎకరాల భూములను కొందరు ఆక్రమించుకున్నారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, గుమ్మా శ్రీనివాసులు, గుండాల రమేష్ ఉన్నారు.



స్థానిక రైతులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి